డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అధిక నిధులు



మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ కె.రవిచారి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ముషీరాబాద్ నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి అత్యధిక నిధులు కేటాయించి ఖర్చు చేస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. నియోజకవర్గంలోని రాంనగర్ డివిజన్ చిక్కడపల్లి సోప్ ఫ్యాక్టరీ లేన్‌లో రూ.23లక్షలు, శివ మెడికల్ హాల్ లేన్‌లో రూ.8లక్షలు, స్ట్రీట్ నం.10లో రూ.9లక్షలు, నిధులు కేటాయించినట్లు తెలిపారు. అంతేకాకుండా ఆర్టీసి క్రాస్‌రోడ్‌లో మంచినీటి వాటర్ పైప్‌లైన్లకు గాను 35లక్షల రూపాయల నిధుల పనులను స్థానిక కార్పొరేటర్ కె.రవిచారి, జలమండలి అధికారి జ్యోతితో కలిసి ఆయన ప్రారంభించారు.

◆ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పలు చోట్ల డ్రైనేజీ సమస్య తీవ్ర స్థాయిలో ఉందని అన్నారు. సమస్య పరిష్కారానికి అత్యధిక నిధులు కేటాయించి నూతన పైప్ లైన్‌లను వేస్తున్నట్లు తెలిపారు. త్వరలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని అన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నాణ్యతతో కూడిన పనులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, శంకర్ ముదిరాజ్, ముదిగొండ మురళి, ఇంద్రసేనారెడ్డి, వి.నాగభూషణం, కందూరి కృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

పీవైఎల్, పీఓడబ్ల్యూ డిమాండ్



మార్క్స్ భవన్‌లో జరిగిన సమావేశంలో పీవైఎల్, పీఓడబ్ల్యూ ప్రతినిధులు

ముషీరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రిల్లో మెరుగైన వైద్యం ప్రజలకు అందడం లేదని, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రిల్లో అధిక డబ్బులు దోపిడీ తీవ్రస్థాయికి పెరిగిందని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని ప్రొగ్రెసివ్ యూత్ లీగ్(పీవైఎల్), ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) డిమాండ్ చేసింది. గురువారం మార్క్స్‌భవన్‌లో జరిగిన సంఘాల సంయుక్త సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్.ప్రదీప్, వి.అజయ్, డి.స్వరూప, సి.హెచ్. శిరోమణి మాట్లాడారు. నవంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రిల్లో సర్వే నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమస్యలకి నిలయాలుగా మారాయని అన్నారు. డాక్టర్ల, నర్సులు, పారామెడికల్ టెక్నీషియన్స్ కొరత తీవ్రంగా ఉందన్నారు. మందులు అరకొర ఇచ్చి మిగతా మందులు, ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుక్కోవాల్సి వస్తోందన్నారు.

◆ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రైవేటు మెడికల్ షాపుల దందా కొనసాగుతుందన్నారు. మందులకు కనీసం బిల్లులు కూడా ఇవ్వట్లేదన్నారు. ఇన్‌పేషంట్లకి పెట్టే భోజనం నాణ్యత లేదన్నారు. అన్ని రకాల టెస్టులు చేయకపోవడం మూలంగా బయట డబ్బులతో టెస్టులు చేయించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. అలాగే ప్రైవేటు, కార్పొరేటర్ ఆసుపత్రుల్లో దోపిడీ తీవ్రస్థాయిలో ఉందన్నారు. చిన్న రోగంతో ఆసుపత్రికి వెళ్తే లక్షల రూపాయల బిల్లులు వేస్తున్నారన్నారు. మందుల బిల్లులకి అడ్డు అదుపులేదని, పీఆర్వోల విధానంతో ఆసుపత్రికి పేషెంట్లను తరలిస్తూ అధిక బిల్లులు వేస్తున్నారన్నారు.

◆ వీటిపై ప్రభుత్వం నియంత్రణ లేదని, దీంతో ఇష్టారాజ్యంగా బిల్లులు వేస్తున్నారని అన్నారు. ఈ దోపిడిపై అసెంబ్లీలో చర్చించి, దోపిడిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర అరుణ్, పీవైఎల్, పీఓడబ్ల్యూ సంఘాల రాష్ట్ర నాయకులు బి.ఝాన్సీ, ఆవుల మంగతాయి, శోభ, వరలక్ష్మి, ఎం.రవికుమార్, రాకేష్, బి.ఎస్.కృష్ణ, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



ప్రభుత్వ ప్రధాన సలహాదారుకు వినతిపత్రం సమర్పిస్తున్న పీడీఎస్‌యూ ప్రతినిధి బృందం

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో విద్యా రంగ సమస్యలన్నిటిని పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది. యూనివర్సిటీలో స్టూడెంట్స్ ఎజెండా అమలు చేయాలని, ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని కోరింది. తెలంగాణ అధ్యక్షుడు ఎస్.నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎస్.సుమంత్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థల బలోపేతం కోసం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. తెలంగాణలోని ప్రభుత్వ యూనివర్సిటీల్లో పేద, గ్రామీణ ప్రాంతాల వారు ఉన్నారని అన్నారు. వారి అభ్యున్నతి కోసం ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. ఓయూలో మెస్ డిపాజిట్ల పద్ధతి రద్దు చేయాలన్నారు. యూనివర్సిటీ విద్యార్థులకు ఫెలోషిప్ పథకం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మందా సురేష్, కోటేశ్వరరావు, ఎస్.అంజి, శివ, క్రాంతి, సంతోష్, పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు చొరువ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గురువారం ఆయన నివాసంలో అంబర్‌పేటకు చెందిన వంశీకి సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద ముందస్తుగా మంజూరైన రూ.2లక్షల మంజూరు పత్రాన్ని అందించారు. సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదల వైద్యానికి భరోసా ఇస్తోందని ఆయన అన్నారు.

రేపు బాబా మందిరంలో శ్రీదత్త జయంతి



నల్లకుంట: బాగ్ అంబర్‌పేటలోని శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో ఈనెల 14న శ్రీదత్త జయంతిని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీషిరిడీ సాయిబాబా సంస్థాన్ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు నగర సంకీర్తనతో మహోత్సవం ప్రారంభమవుతుందని చెప్పారు. 5.30 గంటలకు కాకడ హారతి, 6.30 గంటలకు బాబాకు దివ్యమంగళ స్నానం, అనంతరం గురు స్తోత్రం, హనుమాన్ చాలీసా, భజన ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఉదయం 9 నుంచి రాత్రి 8గంటల వరకు సాయిబాబా సంస్థాన్ పారాయణ బృందంచే శ్రీగురు చరిత్ర సంపూర్ణ పారాయణ ఉంటుందని చెప్పారు. సాయంత్రం 6.30 గంటలకు శ్రీసత్య దత్త వ్రతం ఉంటుందన్నారు. అనంతరం పల్లకీ సేవ, ఊయల సేవ, రాత్రి 9.30 గంటలకు శేజ్ హారతితో మహోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొనాలనుకునే భక్తులు పూజా సామగ్రి తీసుకు రావాలని సూచించారు. ఈ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దత్తాత్రేయస్వామి కృపకు పాత్రులు కావాలని సాయిబాబా సంస్థాన్ ప్రతినిధులు కోరారు.

దేవాలయ రెనోవేషన్ కమిటీలో 18మందికి చోటు

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయ రెనోవేషన్ కమిటీని ప్రభుత్వం నియమించింది. 18 మందితో కూడిన రెనోవేషన్ కమిటీ ఆర్డర్ కాపీని దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజారామయ్యర్ విడుదల చేశారు. ఈ కమిటీ సభ్యులకు ఆర్డర్ కాపీలను దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శుక్రవారం ఉదయం 9గంటలకు జరిగే కార్యక్రమంలో అందజేస్తారని ఆలయ ఈఓ దేవనాథం తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా జానకీ సుధాకర్‌ను ఎన్నుకునే అవకాశాలు అధికశాతం ఉన్నాయని సభ్యులు, భక్తులు అంటున్నారు.

15న దివ్యాంగులకు సహాయ పరికరాల పంపిణీ

కాచిగూడ: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పేద, బడుగు, బలహీనవర్గాలతో పాటు దివ్యాంగుల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి నేతృత్వంలో ఈనెల 15వ తేదీన ఆదివారం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్స్‌లో దివ్యాంగులకు ఉచితంగా సహాయ పరికరాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వై.అమృత, కన్నె ఉమా రమేష్‌యాదవ్, అజయ్‌కుమార్, కృష్ణగౌడ్, శ్యాంరాజ్, చిట్టి శ్రీధర్, రమేష్‌యాదవ్, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



ముషీరాబాద్: వరల్డ్ కన్జ్యూమర్స్ రైట్స్ ప్రొటెక్షన్ తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ చైర్మన్‌గా పొట్టిపెంజర రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర వరల్డ్ కన్జ్యూమర్స్ రైట్స్ ప్రొటెక్షన్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్ చేతుల మీదుగా రమేష్ నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో కల్తీ, నకిలీ వస్తువులు చలామణి అవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తక్కుంట్ల విశాల్ రెడ్డి, ప్రవీణ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దగాపడ్డ కళాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలి



'పాటల పల్లకీలో 32 గంటలు' కార్యక్రమంలో పాల్గొన్న కవులు, కళాకారులు



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డప్పు వాయిస్తున్న కళాకారులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రభుత్వ హయాంలో దగాపడ్డ కళాకారులను ఆదుకొని వారికి ఉద్యోగాలు ఇవ్వాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఉద్యమ కళాకారులకి ప్రభుత్వం అన్యాయం చేసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పాటలపల్లకీలో 32గంటలు దగాపడ్డ కళాకారుల డప్పుల మోత కార్యక్రమాన్ని ప్రముఖ గాయకుడు నేర్నాల కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహజకవి అందెశ్రీ, దరువు ఎల్లన్న, అంతడుగుల నాగరాజు, చక్రాల రఘు, అంతడుగుల రమాదేవి, రాచకొండ రమేష్, బాబ్జీ, అనువోజు వెంకటేష్‌లతో పాటు వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున కళాకారులు పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో సాంస్కృతిక సారథి చైర్మన్‌గా రెండుసార్లు రసమయి బాలకృష్ణ పనిచేసినా నిజమైన కళాకారులకు ఉద్యోగం ఇవ్వకుండా నకిలీ కళాకారులకు ఉద్యోగాలు అమ్ముకున్న దుస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వంలో అన్యాయానికి గురైన కళాకారులు సాంస్కృతిక సారథిని ప్రక్షాళన చేయాలని నకిలీ కళాకారులను తొలగించాలన్నారు. అలు సిసలైన కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈనెల 13న మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొంటారని తెలిపారు.

శ్రామిక బహుజన విప్లవోద్యమ నేత చంద్రన్న



చంద్రన్న వర్ధంతి సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: శ్రామిక బహుజన విప్లవోద్యమ నేత కళ్లెపు చంద్రన్న అని పలువురు వక్తలు అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చంద్రన్న 5వ వర్ధంతి సభ కె.ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, ప్రఫూల్ రాంరెడ్డి, స్కైలాబ్‌బాబు, లక్ష్మీదేవి మాట్లాడుతూ.. రెక్కాడితే గాని డొక్కాడని జీవితం నుంచి వచ్చిన చంద్రన్న రోజు కూలీగా 1964లో రైల్వేలోని పార్సల్ సర్వీస్‌లో పనిచేశాడన్నారు. ఆ తరువాత 1969 నుంచి 1971 వరకు టెలిఫోన్ శాఖలో కూలీగా చేశాడని అన్నారు. 1976లో జరిగిన ఇండ్ల స్థలాల పోరాటంలో క్రియాశీలకంగా వ్యవహరించి పట్టాలు సాధించారని అన్నారు. ఐడీపీఎల్‌లో హెల్పర్‌గా చేరి కార్మిక నాయకుడిగా ఎదిగి అక్రమ అరెస్టులు తప్పుడు కేసులకు గురై జైలు జీవితాన్ని కూడా గడిపాడన్నారు. ఎమర్జెన్సీ చీకటి రోజులలో చంద్రపుల్లారెడ్డి ఉద్యమానికి ఆకర్షితుడై కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేశాడన్నారు. 2005లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో నక్సలైట్స్‌తో శాంతి చర్చలకు ప్రధాన భూమికను పోషించారని గుర్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఎఫ్ నాయకుడు ధనలక్ష్మి, అడ్వకేట్ హేమలత, షేక్ షవాలీ, యాదగిరి, గంగిరాజ్, సురేష్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీరామ పట్టాభిషేకం హరికథా గానం



'శ్రీరామ పట్టాభిషేకం'హరికథా గానం చేస్తున్న బుర్రా పద్మనాభ శర్మ భాగవతులు



భాగవతారాణిని 'హరికథా సరస్వతి'బిరుదుతో సత్కరిస్తున్న ముఖ్యఅతిథులు

నల్లకుంట: నల్లకుంట శంకరమఠంలో ఈనెల 7న ప్రారంభమైన శ్రీమదజ్జాడ నారాయణదాస వర్యుల 160వ, నేతి లక్ష్మీనారాయణ భాగవతులు 126వ జయంతి హరికథా మహోత్సవాలు గురువారంతో ముగిసాయి. ముగింపు వేడులకు అతిథిగా హాజరైన ప్లాంజేరి శంకర నారాయణ, ప్రోగ్రామ్ కన్వీనర్ యనమండ్ర వెంకటకృష్ణయ్య, నేతి వారసులు విశ్వేరరావు దంపతులు, రామకృష్ణ, దాలిపర్తి ఉమామహేశ్వరావు భాగవతారిణి, రాష్ట్ర హరిదాస సంఘం అధ్యక్షుడు బి.లక్ష్మీనారాయణ భాగవతులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. పాశ్చాత్య సంస్కృతి మోజులో నేటి యువత హరికథను ఆదరించడం లేదన్నారు.

◆ ఈ సందర్భంగా ప్రముఖ హరికథకులు బుర్రా పద్మనాభ శర్మ భాగవతులు 'శ్రీరామ పట్టాభిషేకం'పై చేసిన హరికథా గానం ఆకట్టుకుంది. దీనికి వయోలిన్‌పై పాణ్యం దక్షిణామూర్తి, మృదంగంపై చిదంబర నటరాజ్‌కుమార్ వాద్య సహకారం అందించారు. చివరగా పద్మశ్రీ దాలిపర్తి ఉమామహేశ్వరి భాగవతారిణిని 'హరికథా సరస్వతి' బిరుదుతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమం నిర్వాహకులు, హరికథా అభిమానులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు



అంబర్‌పేట: డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం వివిధ విభాగాల అధికారులతో బి.పద్మావెంకట్‌రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జలమండలి, జీహెచ్ఎంసీ, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో గురువారం డివిజన్‌లోని శారదనగర్ కమ్యూనిటీహాల్‌లో పలు సమస్యలపై చర్చించారు. పారిశుద్ధ్యం, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ సమస్య వంటి వాటిపై సమీక్షించారు. మౌళిక సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దని ఆమె అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జలమండలి డీజీఎం విష్ణువర్ధన్ రావు, ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమాలత, ఏఈ ప్రశాంతి, మాజీద్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి



వైద్యులను సత్కరిస్తున్న డాక్టర్ హిప్పో, కమలాకర్, నిర్వాహకులు

అంబర్‌పేట: నవభారత లయన్స్ క్లబ్, వనిత భారత లయన్స్ క్లబ్, క్యాపిటల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో అంబర్‌పేట సయోధ్య షెల్టర్ హోంలో కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారత్ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు జీ.కృష్ణవేణితో కలిసి హిప్పో పద్మా కమలాకర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందన్నారు. దీనిపై అవగాహన కల్పించాల్సిన అవసరముందన్నారు. భారతదేశంలో ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక మహిళ కేన్సర్ వ్యాధితో ప్రాణాలు కోల్పోతుందని ఆమె తెలిపారు. కేన్సర్ వ్యాధి శారీరక అనారోగ్యంతో పాటు, మానసిక ప్రభావన్ని చూపుతుందన్నారు. ఇలాంటి హెల్త్ క్యాంపులు ఎంతో ఉపయోగపడుతాయని నిర్వాహకులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో కేన్సర్ స్క్రీన్ పరీక్షల నిర్వహణలో పాల్గొన్న వైద్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సయోధ్య వ్యవస్థాపకురాలు మృదుల, కోఆర్డినేటర్స్, స్వప్న, వరలక్ష్మి, భారతి, పార్వతి, సుమ, బి.రమాదేవి, వైద్యులు దేవిరాణి, ముషారఫ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

బస్తీవాసులకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడుతున్న బీజేపీ నేత ఎ.వినయ్‌కుమార్

చిక్కడపల్లి: శ్రీస్వామి వివేకానందనగర్ బస్తీవాసులు ఏడాదిగా ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులుగా ఉన్నారని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం వారికి పునరావాసం కింద డబుల్ బెడ్‌రూమ్‌లు కేటాయించి ఆదుకోవాలని గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కి వినతి పత్రం అందజేశారు. అనంతరం గాంధీనగర్ ఆయన విలేకరులతో మాట్లాడుతూ... జనవరిలో ఇళ్లను కూల్చివేసిన అధికారులు బాధితులకు పునరావాసం కల్పించలేదన్నారు. 11 నెలలుగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఇప్పటికే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సైతం బస్తీవాసులు ఇళ్లు కేటాయించాలని లేఖ రాశారని గుర్తు చేశారు. బాధితులకు సరైన న్యాయం జరిగే వరకు వారికి అండగా ఉండి పోరాడుతామన్నారు. తన విజ్ఞప్తి మేరకు మంత్రి సానుకులాంగా స్పందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు ఎంబీ కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల అధ్యాపకులు, షెఫ్‌లు

అంబర్‌పేట: క్రిస్మస్ వేడుకలు ఆకట్టుకున్నాయి. అలంకరణలు, రుచులతో అలరించాయి. గురువారం డీడీకాలనీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్(ఏహెచ్ఎం)లో క్రిస్మస్ సంబరాలు సందడిగా జరిగాయి. భిన్న రకాల కేక్‌లు, అలంకరణలు, ప్రత్యేక వంటకాలతో వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో పాల్గొని ఫైవ్‌స్టార్ హోటల్ షెఫ్‌లు తమ వంటకాలను పంచుకున్నారు.శాంతాక్లాజ్, కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అలంకరణ అందరిని ఆకట్టుకుంది.

◆ ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్ కే థాకుర్ మాట్లాడుతూ... హోటల్ మేనేజ్‌మెంట్ విద్యాను పూర్తి చేసిన ప్రతి ఒక్కరికి ఉద్యోగ ఉపాధి అవకాశం వందశాతం లభిస్తుందన్నారు. ఇక్కడి కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థి రెండు లేదా మూడు ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారని అన్నారు. మూడు సంవత్సరాల కాలపరిమితి గల కోర్సుకు ప్రవేశ పరీక్ష ద్వారా అడ్మిషన్ ఉంటుందని ఆయన తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరాం 2025 కోసం వచ్చే ఏడాది ఏప్రిల్ 27న ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో క్రిస్మస్ వేడుకలో శాంతా క్లాజ్



హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో క్రిస్మస్ వేడుకలు

రాజ్యాంగాన్ని తగలబెట్టిన వారిని అరెస్ట్ చేయాలి



కాచిగూడ: పర్భానిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట రాజ్యాంగాన్ని తగలబెట్టిన గుండాలను వెంటనే అరెస్ట్ చేయాలని ఐహెచ్ఆర్‌సీ సెక్రటరీ జనరల్, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ మహారాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నారాయణగూడలోని సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని తగలబెట్టిన ఘటనను తీవ్రంగా ఖండించారు. మహారాష్ట్రలో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ దుశ్చర్యలకు దుండగులు పాల్పడ్డారని అన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ రాజకీయ శక్తులే ఈ దారుణాలకు పూనుకున్నాయని ఆరోపించారు.సీఎం ఫడ్నవీస్ భారత జాతికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీఎల్ రాజు, జేఎస్‌రావు, మద్దెల ప్రవీణ్ కుమార్, సీహెచ్ రాజేందర్, గణేష్, అశోక్‌గౌడ్, కరణం రాఘవేందర్, పి.సుచంద్ర పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ప్రమాద బీమా రెన్యువల్ చేయాలి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ నేతలు

కాచిగూడ: ఆటో కార్మికులకు ప్రమాద బీమా రెన్యువల్ చేయాలని గురువారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంత్రి చాంబర్‌లో ఐఎన్‌టీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నరసింహారెడ్డి, ప్రధానకార్యదర్శి గోదా మల్లేష్‌గౌడ్, నగర అధ్యక్షుడు దయానంద్, నాగమల్లయ్య కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు నారాయణగూడలో మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే ప్రమాద బీమాను రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాలని కోరారు. ఈ స్కీమ్‌కు రాజీవ్ డ్రైవర్స్ ప్రమదా బీమా పథకమని పేరు పెట్టాలని సూచించారు. ఈ సంవత్సరం రెన్యువల్ చేసి డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ప్రతి డ్రైవర్‌కు ప్రమాద బీమా వర్తింపజేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. బాధితులకు చెక్కులను రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యేల ద్వారా అందించే విధంగా చూడాలని కోరారు. సహజ మరణం, అంగవైకల్యం పొందిన డ్రైవర్లకు రూ.3లక్షలు బీమా అందించాలన్నారు. లైసెన్స్ కలిగిన ప్రతి డ్రైవర్‌కు ఈ బీమా పథకం వర్తింపజేయాలన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ పరంగా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఎస్సీలోని అన్ని కులాలకు న్యాయం చేయాలి

ముషీరాబాద్: జనాభా ప్రతిపాదికన ఎస్సీ వర్గీకరణ చేసి ఎస్సీలలో ఉన్న అన్ని కులాలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి భిక్షపతి మాదిగ డిమాండ్ చేశారు. గురువారం ముషీరాబాద్‌లోని మోహన్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల కార్యకర్తల సమావేశం జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్ల ప్రకారం ఎస్సీలలోని అన్ని కులాలకు న్యాయం చేకూర్చే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలన్నారు. 77 ఏళ్లుగా ఎస్సీ రిజర్వేషన్లు కేవలం ఒక్క కులానికే పరిమితం అయ్యాయని ఆరోపించారు. మాల సామాజికవర్గమే అన్ని రంగాలలో లబ్ధిపొందిందన్నారు. అందువల్లే బీసీ రిజర్వేషన్లలో వర్గీకరణ ఉన్నట్లుగానే ఎస్సీ రిజర్వేషన్లలో కూడా వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సీనియర్ నాయకులు గండి కృష్ణ, ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్, నాయకులు దశరథ్, ఎల్లయ్య, రాములు, శంకర్, కేశవులు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.